

అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-నెల్లూరు : సంక్షేమ వసతి గహాల్లో నూతన విద్యార్థులు ప్రవేశాల కోసం అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించాలని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోషల్ వెల్ఫేర్ జిల్లా సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వెన్ను నరేంద్ర మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలోని పలు సంక్షేమ వసతి గహాలలో చదువుకునే విద్యార్థులు సంఖ్య తగ్గుతుందన్నారు. వసతి గహాలు ఉండాల్సినటువంటి సదుపాయాలు లేకపో వడంతో చేరికలు తక్కువగా ఉన్నాయని, చేరికలు పెంచడానికి హాస్టల్లో వసతులు మెరుగుపరిచి విద్యార్థుల చేరికకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా సంక్షేమ అధికారులు జిల్లాలో ఉన్నటువంటి సంక్షేమ హాస్టల్లో పర్యటించి అక్కడ పరిస్థితులను ప్రభుత్వ దష్టికి తీసుకెళ్లి విద్యార్థులు చదువుకునేందుకు మెరుగైన వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కార్తీక్ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

బిపిసిఎల్ ప్రాజెక్టు ముందడుగు..!

- ◆భూములు ధరలు పెంచుతూ కేబినెట్ నిర్ణయం
- ◆ఎకరాకు రూ. 4 లక్షలు అదనంగా పెంపు
- ◆నెల్లూరులో పేదల పట్టాలకు గ్రీన్ సిగ్నల్
- ◆భగత్‌సింగ కాలనీ వాసులకు నెరవేరిన కల



రామాయపట్నం పోర్టు ఏరియా

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

రామాయపట్నం పోర్టు సమీపంలో నూతనంగా రూ 95 వేల కోట్లతో బిపిసిఎల్ పెట్రో కెమికల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి ముందడుగు పడింది. ఇక్కడ ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం పెద్ద ఎత్తున భూసేకరణ నిర్వహిస్తోంది. ఇప్పటికే సోలార్ ఎనర్జీ కోసం 10 వేల ఎకరాలు భూసేకరణ చేశారు. తాజాగా నూతన ప్రాజెక్టుకోసం 8,334 ఎకరాలు భూసేకరణ చేయనున్నారు. రైతులు పరిహారం విషయంలో అసంతృప్తిగా ఉన్నారు. గతంలో రామాయపట్నం పోర్టు భూసేకరణ సమయంలో పరిహారం అందక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ నేపథ్యంలో బిపిసిఎల్ ప్రాజెక్టు కోసం ఇప్పటికే పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి యువరాజ్, కలెక్టర్ ఆనంద్ ఆ ప్రాంతంలో పర్యటించారు.ఇక్కడ రైతులకు న్యాయమైన పరిహారం చెల్లించాలని, సిపిఎం, వ్యవసాయకార్మికశాఖ ఆధ్వర్యంలో పలుమార్లు రైతులు ఆందోళన నిర్వహించారు. బిసిపిఎల్ ప్రాజెక్టుకు ప్రధానంగా భూసేకరణ విషయంలో రైతుల నుంచి, రాజకీయ పార్టీల నుంచి నిరసన వ్యక్తమౌతొంది. ఈ విషయమై కలెక్టర్ ఒ. ఆనంద్ ప్రభుత్వానికి నివేదిక పంపారు. గురువారం జరిగిన రాష్ట్ర క్యాబినెట్‌లో కీలకమైన నిర్ణయం తీసుకున్నారు. గుడ్లూరు మండలం, రావూరు గ్రామంలో ఎపి మారిటైమ్ బోర్డు ద్వారా పారిశ్రామికాభివృద్ధికి భూములు స్వీకరిస్తున్నారు. ప్రస్తుతం అక్కడ ఎకరా రూ 16 లక్షల రూపాయాలుంది. అదనంగా మరో రూ 4 లక్షలు పెంచుతూ రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో ఎకరా రూ 20 లక్షలు చేరింది. నెల్లూరు నగరంలోని పెన్నా తీరం వద్ద 2006లో ఇంటి స్థలాల కోసం సిపిఎం, సిపిఐ పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించారు. ఎన్‌టిపిఎస్ థర్మల్ ప్రాజెక్టుకు సంబంధించి బూడిద గుంట అక్కడ ఉండటం, ఎన్‌టిపిఎస్ మూతపడడంతో నిరుపేదల ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆందోళనకు దిగారు. కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో పేదలు గుడెసెలు వేశారు. పెన్నా పరివాహక ప్రాంతాల్లో వెంకటేశ్వరపురం కాలనీకి ఆనుకొని సుమారు 1400 మంది పేదలు ఇళ్ల నిర్మాణం చేసుకున్నారు. దీనిని భగత్‌సింగ్ కాలనీగా నామకరణం చేసుకున్నారు. కొంత భూమిలో రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌టిఆర్ అర్బన్ హౌసింగ్ నిర్మాణం చేశారు. ఎన్నో ఏళ్లుగా నివాసముంటున్న కాలనీ వాసులు పట్టాలు, వరదలకు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. తమకు ప్రభుత్వం పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మంత్రి పి.నారాయణ ఈ విషయంలో కొంత చొరవ తీసుకున్నారు. గురువారం జరిగిన కేబినెట్‌లో నెల్లూరు నగరంలోని నెల్లూరు బిట్ -11 గ్రామంలో సర్వే నెంబర్ 2062-3 భూమిని "పెన్నా నది పోరంబోకు" నుండి అప్సెట్ వేస్ట్ డ్రై భూమిగా మార్పు. కొత్త సర్వేనెంబర్ 2224 క్రింద భగత్ సింగ్ కాలనీ వాసులకు పట్టాలు మంజూరు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. కలెక్టర్‌కు పట్టాలివ్వాలని ఆదేశించింది. ఎన్నో ఏళ్ల భగత్‌సింగ్ కాలనీవాసుల పోరాటం, కల మంత్రి నారాయణ సాకారం చేశారు. కమ్యూనిస్టుల ఉద్యమం ఫలితం ఎంతో ఉంది. తెలుగుదేశం పార్టీ నాయకులు ముజీర్ తదితరులు గురువారం మంత్రి నారాయణ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. భగత్ సింగ్ కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేశారు.

మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నిరంతరం ప్రజల్లో ఉండాలి

రూరల్ ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు : నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలో డివిజన్ అధ్యక్షులు,కార్పొరేటర్లు నిరంతరం ప్రజల్లో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కషి చేయాలని రూరల్ ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక మాగుంట లే అవుట్ సమీపంలోని కార్యాలయంలో గురువారం టిడిపి నూతన డివిజన్ అధ్యక్షులు కార్పొరేటర్లు ఇతర ముఖ్య నేతలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలియజేశారు. డివిజన్ పరిధిలో స్థానికంగా ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి తమ దష్టికి తీసుకురావాలన్నారు. కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ క్లస్టర్ ఇన్‌ఛార్జులు, డివిజన్ ఇన్‌ఛార్జులు మరింత శ్రద్ధతో పనిచేయాలన్నారు. మాజీ మేయర్ నంది మండలం భాను శ్రీ, క్లస్టర్ ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి-నెల్లూరు

నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో వేసవి దృష్ట్యా తాగునీటి సరఫరా సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కమిషనర్ వై.ఓ నందన్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 30వ డివిజన్ వైఎస్ఆర్ నగర్, మల్లయ్య గుంట, కేంద్రీయ విద్యాలయం, జర్నలిస్టు కాలనీ ప్రాంతాలలో కమిషనర్ గురువారం పర్యటించారు. స్థానిక ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకొని తాగునీటికి సంబంధించిన సమస్యలను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ మాట్లాడుతూ అన్ని డివిజన్లలో తాగునీటి చేతి బోర్ల పనితీరును పరిశీలించి, అవసరమైన వాటికి రిపేర్లు చేయించాలని సూచించారు. చేతి బోర్ల మరమ్మతులకు అవసరమైన స్పేర్ పార్ట్స్, అదనపు సిబ్బందిని నియమించుకుని యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. మల్లయ్య గుంట ప్రాంతంలో నూతనంగా రోడ్లు, డ్రైన్ కాలువల నిర్మాణాలకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులకు సూచించారు. స్థానిక 37వ డివిజన్ క్రాంతి నగర్ ప్రాంతంలో మాజీ మేయర్ భానుశ్రీ తో కలిసి కమిషనర్ వివిధ ప్రాంతాలలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పర్యవేక్షించారు. 17వ డివిజన్ ఆకుతోట ప్రాంతంలోని డి.ఎస్.కే గార్డెన్స్ తదితర ప్రాంతాలలో కమిషనర్ పర్యటించి ఖాళీ స్థలాలను, పారిశుధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. ఇంజనీరింగ్ విభాగం అధికారులు శేషగిరిరావు, ఏ.ఈ అర్చిత పాల్గొన్నారు.

డివిజన్లలో పర్యటిస్తున్న కమిషనర్

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి-కందుకూరు

ఈనెల 20న కార్మిక సంఘాలు తలపెట్టిన సార్వత్రిక సమ్మెను కందుకూరు నియోజకవర్గంలో జయప్రదం చేయాలని గురువారం సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. కందుకూరు సుందరయ్య భవన్లో సిఐటియు ముఖ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కార్మిక సమ్మె ఎందుకు? అనే బుక్ లెట్ ను ఆవిష్కరించారు. సిఐటియు జిల్లా కార్యదర్శులు జి వెంకటేశ్వర్లు, ఎస్ కే సల్మా, జిల్లా నాయకులు, ఎస్ ఏ గౌస్, జి వి బి కుమార్, సిఐటియు గుడ్లూరు మండల అధ్యక్ష కార్యదర్శులు, ఎస్.కె పద్మజ, కొట్టే వెంకయ్య, డిఎం రాయుడు పాల్గొన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి జి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న 29 హక్కులను రద్దు పరచి, 4 లేబర్ కోడ్లను విధించడం వలన, కార్మికులు బలైపోతున్నారన్నారు. వెంటనే లేబర్ కోడ్ లను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు.ఈ నేపథ్యంలో కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 20వ తేదీ జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ముందుగా ఈనెల 13వ తేదీన కందుకూరులో నియోజకవర్గస్థాయి సదస్సును జయప్రదం చేయాలన్నారు. 15 ,16 తేదీలలో కందుకూరు నుండి ప్రారంభమయ్యే జిల్లా జాతను జయప్రదం చేయాలని సమావేశం తీర్మానించింది.

బుక్ లెట్ ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

మంత్రి నారాయణ చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

శాశ్వత ఇళ్ల పట్టాలు కావాలనే భగత్ సింగ్ కాలనీవాసుల 19 ఏళ్ల కలను సాకారం చేస్తూ రాష్ట్ర కేబినెట్ ద్వారా ఆమోదం తీసుకొచ్చిన రాష్ట్ర మున్సిపల్ పట్టణాభివద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ చిత్రపటానికి గురువారం స్థానిక భగత్ సింగ్ కాలనీలో పాలాభిషేకం చేశారు. ఈ ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ సఫియా ముజీర్ మాట్లాడుతూ 2006లో భగత్‌సింగ్ కాలనీ ఏర్పడినప్పటి నుంచి ఏ రాజకీయ నాయకుడు కూడా పట్టాలు ఇవ్వడానికి చిత్తశుద్ధితో కషి చేయలేదన్నారు. మంత్రి నారాయణ పేదల కలను సాకారం చేశారన్నారు. మాజీ మునిసిపల్ ఛైర్ పర్సన్ తాళ్లపాక అనురాధ, స్థానిక టిడిపి నాయకులు మునీర్, అన్వర్ , రషీద్, పెంచలయ్య, కిరణ్, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

జెసిబిని అడ్డుకున్న గ్రామస్తులు..!

కేసు నమోదుకు తహశీల్దార్ ఆదేశం -'ప్రజాశక్తి 'వార్త ఎఫెక్ట్

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

వెంకటగిరి నియోజకవర్గం, కలువాయి మండలం, తెలుగురాయపురం గ్రామంలో అధికారపార్టీకి చెందిన కొందరు వ్యక్తులు 130 ఎకరాలకు ఎసరుపెట్టే చర్యలకు రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. బుధవారం 'కలువాయిలో తమ్ముళ్ల భూమాయ" పేరుతో కథనం వచ్చిన విషయం తెలిసిందే.. గురువారం ఉదయం ఆ గ్రామానికి చెందిన కొందరు అక్కడ పనులు నిర్వహిస్తున్న జెసిబిని, సిబ్బందిని అడ్డుకున్నారు.'మా గ్రామంలో మీ పెత్తనం ఏమిటని, ఇక్కడ నుంచి వెళ్లిపోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ఒక ప్రజా ప్రతినిధికి చెందినదగా వాహనదారులు చెప్పారు. స్థానికులు తహశీల్దారులకు ఫిర్యాదు చేశారు. ఆయన విఆర్‌ఒకు ప్రభుత్వ భూమిలో ఉన్నవారిపై కేసు నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. వెంకటగిరి మీదుగా జాతీయ రహ దారి నిర్మాణం జరగడంతో అక్కడ భూములకు రెక్కలొచ్చాయి. దీనిని ఆసరా చేసుకున్న కొందరు అధికారపార్టీ నేతలు సుమారు 130 ఎకరాలకు ఎసరుపెట్టినట్లు తెలుస్తోంది. నకిలీ పత్రాలు సృష్టించి, కాజేసెందకు ప్రయత్నాలు మొదలు పెట్టారనే విమర్శలున్నాయి. కలువాయి మండలం తెలుగురాయపురం గ్రామంలో జరుగుతోన్న ఈ తంతును స్థానికులు ఇప్పటికే అధికారులు దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. తెలుగు రాయపురంలో గ్రామ రెవెన్యూ రికార్డుల ప్రకారం 585-2, 586- 1,590-3,593, 577,578 సర్వే నెంబర్‌లో సుమారు 130 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉంది. రాజుపాలెం గ్రామానికి చెందిన టిడిపికి చెందిన వెంకటసుబ్బరాజు మరో 26 మంది పేరుతో డిఫామ్ పట్టాలు 2013లో పొందారు. నిరుపేదలకు ఇవ్వాల్సిన ఈ భూములు పెద్దలకు ఇచ్చారని తెలిసింది. స్థానికులకు కాకుండా అప్పటి ప్రభుత్వం అండతో నకిలీ పేరు పెట్టి, నకిలీ రికార్డులు సృష్టించారని సమాచారం. నిరుపేదలకు ఎకరా భూమి ఇవ్వడానికి నానా ఇబ్బందులు పెట్టే రెవెన్యూ అధికారులు తప్పుడు పేర్లతో ఒకొక్కరికి పది ఎకరాలు ఇచ్చినట్లు రికార్డులు సృష్టించినట్లు సమాచారం. గ్రామస్తులు దీనిని వ్యతిరేకించడంతో వెంకటసుబ్బరాజు తమకు హద్దులు చూపించాలని హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిసింది. ఎకరా ప్రస్తుతం రూ 25 లక్షల వరకు ధర పలుకుతొంది. ఇక్కడ భూమిని కాజేసేందకు కొందరు స్థానిక నేతలతో కలిసి పన్నాగం పన్నినట్లు సమాచారం. కలువాయి రెవెన్యూ కార్యాలయంలో కొత్త రికార్డులు సృష్టించారనే విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామస్తులు భూ దందాను అడ్డుకున్నారు. అక్కడ నుంచి జెసిబిని, సిబ్బందిని పంపేశారు. ఏం జరుగుతుందో చూడాలి.

జెసిబిని అడ్డుకుంటున్న తెలుగురాయపురం గ్రామస్తులు

పౌర సేవలపై సమీక్ష

ప్రజాశక్తి-నెల్లూరు : రెవెన్యూ సేవలను ప్రజలకు అందించే క్రమంలో అధికారులు జవాబుదారీతనంగా ఉండాలని అధికారులకు జిల్లా జాయింట్ కలెక్టర్ కె. కార్తీక్ సూచించారు. గురువారం తిక్కన ప్రాంగణంలో రీ సర్వే, డిజిటలైజేషన్, నోషనల్ ఖాతాలు, నీటి తీరువా పన్ను వసూలు, సిటిజన్ సర్వీసెస్ తదితర రెవెన్యూ సంబంధిత విషయాలపై నెల్లూరు డివిజన్ తహసిల్దార్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రీసర్వే ఎటువంటి ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా పూర్తి చేయాలని కోరారు. ప్రభుత్వం అందించే వివిధ రకాల పౌర సేవలకు సంబంధించి ఆయా లబ్ధిదారులకు నేరుగా ఐవిఆర్ఎస్ కాల్స్ ద్వారా ప్రజాభిప్రాయం సేకరిస్తున్నారన్నారు. డిఆర్‌ఒ ఉదయభాస్కరరావు, ఆర్డిఓ అనూష, సర్వే ఎడి నాగశేఖర్ ఉన్నారు.



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్

వేసవి శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు 11 వ గురువారం కూడా జరిగాయి. విద్యార్థులతో ముందుగా కథలు చదివించారు. తదుపరి చెస్ ఆటలు ,చదరంగం ఆటలు ఆటలు నిర్వహిం చారు. విద్యార్థులు సమ్మర్ సెలవులలో గ్రంథాలయానికి వచ్చి చదువుకొనుట అలవాటు చేసుకోవాలని గ్రంథపాలకురాలు పి నాగరాజుని విద్యార్థులకు సూచించారు.

రైతులకు సూచనలు

తోటపల్లిగూడూరు : ప్రకతి వ్యవసాయంపై వ్యవసాయ శాఖ అధికారులు గురువారం అవ గాహన కల్పించారు. తోటపల్లిగూడూరు మండలంలోని పేడూరు యూనిట్ మల్లికార్జునపు రం గ్రామంలో ప్రకతి వ్యవసాయం పై అవగాహన సమావేశం నిర్వహిం చారు. కతి వ్యవసాయంపై దష్టి పె ట్టిన రైతులను సన్మానించారు. సర్పంచ్ స్మార్ట్ విలేజ్ కమిటీ సభ్యులు, దానయ్య, సునీత, కల్పన, స్థానికులు తాళ్లూ రు జీవరత్న, వార్డు సభ్యులు వివి ఏ, ఆశా వర్కర్లు అం గన్వాడీ టీచర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నాలుగో రోజు కొనసాగిన ధర్నా

ప్రజాశక్తి-నెల్లూరు

అరవై ఏళ్లు నిండిన మున్సిపల్ కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని నగరపాలక సంస్థ వద్ద కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల ఆందోళనలో భాగంగా నాలుగో రోజు కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రిటైర్ మున్సిపల్ కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని కోరుతూ మేయర్ స్రవంతి జయవర్ధన్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాను ఉద్దేశించి సిఐటియు నాయకులు నందిపాటి మాల కొండయ్య, పి. సూర్యనారాయణ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యల కోసం గత నాలుగు రోజుల నుండి ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. నగరపాలక సంస్థలో మున్సిపల్ కార్మికులు గా దాదాపు 20, 30 ఏళ్ల నుంచి పనిచేస్తూ, నగరాలను శుభ్రం చేస్తూ అనారోగ్యం పాలైన, ప్రజల యొక్క ఆరోగ్యాలను కాపాడే దాంట్లో కీలక పాత్ర పోషించారు. అటువంటి వీరిని 60 ఏళ్లు నిండాయి అనే నెపంతో ఎటువంటి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా, పను లకు ఆపడం దారుణ మన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు, రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లపాటు వెసులుబాటు ఇచ్చిన ప్రభుత్వం, దళిత, గిరిజనులుగా ఉన్న మున్సిపల్ కార్మికులకు ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రిటైర్మెంట్ మున్సిపల్ కార్మికుల డిమాండ్లన్నింటినీ పరిష్కరించాలన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కే. పెంచల నరసయ్య, సిఐటియు రూరల్ అధ్యక్షులు కొండా ప్రసాద్, మున్సిపల్ నగర గౌరవాధ్యక్షుడు కత్తి శ్రీనివాసులు, సిఐటియు నాయకులు ఎండి, గయాస్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కామాక్షమ్మ, సుజాతమ్మ, వజ్రమ్మ, శ్రీనివాసులు, సలోమి, బుజ్జమ్మ, వెంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న కార్మికులు

'ప్రకాశం' అధ్యాపకుడికి పిహెచ్‌డి డిగ్రీ

ప్రజాశక్తి-కందుకూరు

ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల ఈ.ఈ.ఈ విభాగంలో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ షేక్ ఆరిఫ్ విద్యుత్ పంపిణీ వ్యవస్థల విద్యుత్ నాణ్యత మెరుగుదలపై పరిశోధనలు చేసి పిహెచ్‌డి డిగ్రీ సాధించారు. ఆయన పంజాబ్‌లోని ఫగ్వారాలోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ (యల్‌పియు) నుంచి "మెటా హ్యూరిస్టిక్ సాంకేతికాలతో పంపిణీ వ్యవస్థలలో పంపిణీ యెరుకల సరైన వినియోగం ద్వారా పవర్ క్వాలిటీ మెరుగుదల" అనే అంశంపై పరిశోధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కంచర్ల రామయ్య మాట్లాడుతూ, "ఆరిఫ్ మే 8న యూనివర్సిటీ నుంచి తన పీహెచ్‌డీ ప్రొవిజనల్ సర్టిఫికేట్‌ను స్వీకరించారు. తమ కళాశాల అధ్యాపకులు పరిశోధనల వైపు ముందుకు వెళ్లేందుకు నిరంతరంగా ప్రోత్సాహం అందిస్తోందని, ఇది విద్యా నాణ్యత మెరుగుదలకు దోహదపడుతుంది" అని అన్నారు .టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ కె. విజయ శ్రీనివాస్ మాట్లాడుతూ, "ఆరిఫ్ పరిశోధన సమయంలో 5 అంతర్జాతీయ జర్నల్ పబ్లికేషన్లు, 3 అంతర్జాతీయ కాన్ఫరెన్సులు, 1 పెటెంట్ నమోదు చేయడం విశేషం. ఇది వ్యక్తిగతంగా ఆయన విజయమే కాకుండా, సంస్థ ప్రతిష్టను కూడా పెంచుతుంది" అని తెలిపారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. హెచ్. రవి కుమార్ మాట్లాడుతూ, "ఆరిఫ్ సాధించిన విజయం ఇతర అధ్యాపకులకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు..ఆరిఫ్ తన పరిశోధనకు సహకారం అందించిన గైడ్‌గా డా. సురేష్ కుమార్ సుదబత్తుల, కో-గైడ్‌గా డా. సచిన్ మిశ్రాకు, ప్రకాశం కళాశాల యాజమాన్యానికి ఆరిఫ్ కతజ్ఞతలు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ వి. హరి బాబు, ఆర్ అండ్ డి డీన్ యం. లక్ష్మణ రావు, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున అభినందనలు తెలిపారు.

షేక్ ఆరిఫ్

అంబేద్కర్ జయంతి మాసోత్సవాలు

కెవిపిఎస్ ఆధ్వర్యంలో నాటక ప్రదర్శన

ప్రజాశక్తి - వలేటివారిపాలెం

రాజ్యాంగ పిత అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 134వ జయంతి మాసోత్సవాల సందర్భంగా వలేటివారిపాలెం మండల కేంద్రంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్), స్థానిక అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం వద్ద డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి సర్పంచ్ సాదు శ్రీలత, గ్రామ పెద్ద బీరకాయల మాల్యాద్రి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం యువకులు అంబేద్కర్ చిత్రపటానికి పూలు వేస్తూ అంబేద్కర్ ఆశయాలు కొనసాగిస్తాం అని నినదించారు. ఈ కార్యక్రమానికి కెవిపిఎస్ వలేటివారిపాలెం మండల మాజీ కార్యదర్శి ఎస్ చెన్నకేశవులు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా నాయకులు జవిబి కుమార్, ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మాదాల రమణయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు దువ్వూరి జాన్, కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు గుండ్ల తోటి మాధవమూర్తి, కెవిపిఎస్ వలేటి వారిపాలెం మండల అధ్యక్షులు మంగి జకరయ్య, మండల నాయకులు పర్రె భాస్కరరావు తదితరులు మాట్లాడారు.డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ దేశానికి చేసిన సేవలను విస్మరిస్తూ పాలకులు, కొని ఆధిపత్య వర్గాలు అంబేద్కర్‌ను కొన్ని వర్గాలకే పరిమితం చేయడాన్ని తప్పు పట్టారు. అంబేద్కర్‌అందరివాడని అన్నారు. ఆయన రాసిన రాజ్యాంగాన్ని పక్కనపెట్టి పాలకులు మనువాదాన్ని అమలు చేస్తూ ప్రజల మధ్య విభజన చిచ్చుపెడుతున్నారని విమర్శించారు. అందుకే అంబేద్కర్‌ను అందరికీ పరిచయం చేస్తూ అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ వారిచే 'సంఘం శరణం గచ్ఛామి.. అంబేద్కర్ జీవిత చరిత్రను కళారూపకం, నాటకం ద్వారా ప్రజలందరికీ తెలియపరుస్తున్నామన్నారు. కళాకారులు ప్రదర్శించిన నాటకం ఆకట్టుకుందని ప్రజా కళాకారులు దాస్ తన అభిప్రాయాన్ని పంచు కున్నాడు. స్థానిక అంబేద్కర్ యూత్ నాయకులు ఎస్ చిన్న మాల కొండయ్య, సన్నీ, ఆరెతోటి రవి, దార్ల కిషోర్, చెన్న కష్ణ, సాదు అనిల్, ఏ వేణు, దాసరి మధు, ఏ రమేష్, సిహెచ్ శివరామయ్య, ఎస్ లక్ష్మయ్య , రామాంజయ్య ఉన్నారు.

అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న దృశ్యం

రాష్ట్రంలో ఎమర్జెన్సీ తలపిస్తోంది..

ఎంఎల్‌సి చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వరుస కుంభకోణాలకు పాల్పడుతుందని, ప్రశ్నించే వారిపే కేసులు పెడుతుందని ఎంఎల్‌సి పి. చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న వరుస కుంభకోణాలను ఇతర పత్రికలతో పాటు సాక్షి పత్రిక కూడా.. ప్రచురించడంతో.. సాక్షి పత్రిక పై కక్ష కట్టారన్నారన్నారు. సాక్షి పత్రిక ఎడిటర్ ధనుంజయ రెడ్డిని నిర్బంధించి ఆయన ఇంట్లో పోలీసులు సోదాలు చేయడం దుర్మార్గమన్నారు. పత్రికల్లో వార్తలు రాస్తే.. ఆ పత్రికల ఎడిటర్లను ఇలా.. దారుణంగా నిర్బంధించడం సరికాదన్నారు. సమాజంలో జరుగుతున్న అవినీతిని, దోపిడీలను పత్రికలు ఖండించకుండా ఇంకెవరు ఖండిస్తారో చెప్పాలని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.. ఎమర్జెన్సీ రోజుల్లో ప్రతిపక్ష నాయకుల్ని నిర్బంధించి.. వారిని ఎలా హింసించారో మనందరికీ తెలిసిన విషయమేనన్నారు. ఈరోజు అధికార పార్టీ అయిన తెలుగుదేశం పార్టీ కూడా.. ప్రతిపక్ష పార్టీ నాయకులు, కార్యకర్తలు, వారి మద్దతుదారుకు సంబంధించిన ఇళ్ళ లో సోదాలు జరిపి.. ఎవరో ఒకరి చేత అబద్ధపు వాంగ్మూలం ఇప్పించి.. అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపించడం చూస్తున్నామన్నారు. అధికార పార్టీకి వత్తాసు పాడుతూ పోలీసులు కూడా అత్యంత దారుణంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

మాట్లాడుతున్న ఎంఎల్‌సి చంద్రశేఖర్‌రెడ్డి

విద్యుత్ అధికారుల విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు పట్టణంలో విద్యుత్ విజిలెన్స్ బందం గురువారం విస్తత తనిఖీలు నిర్వహించింది. విద్యుత్ విజిలెన్స్ ఈఈ ఉషారాణి కందుకూరు ఆపరేషన్ ఈఈ ఎం నాగేశ్వరరావు పర్యవేక్షణలో 30 మంది అధికారులు 50 మంది సిబ్బంది 34 బందాలుగా ఏర్పడి విద్యుత్ మీటర్లు తనిఖీ చేశారు. పట్టణంలోని వివిధ ప్రాంతాలలోని గహవినియోగ దారులు ,వ్యాపార సముదాయాలు పరిశీలించారు. ఈ తనిఖీలలో 79 విద్యుత్ సర్వీసులు అదనపు విద్యుత్ వాడకం జరుగుతున్నట్లు గుర్తించారు. సంబంధిత సర్వీసులకు 3 లక్షలు జరిమానాగా విధించారు. రెండు సర్వీసులు ఒక కేటగిరీకి తీసుకొని వ్యాపార అవసరాలకు వాడుతున్న వాటిని గుర్తించి వారికి పది వేలు జరిమానా విధించడం జరిగింది. తనిఖీల అనంతరం ఈఈ ఎం నాగేశ్వరరావు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ వినియోగానికి పాల్పడితే చట్టపకారం చర్యలు ఉంటాయన్నారు. అనుమతించిన లోడు కంటే అదనపు విద్యుత్ వాడిన క్యాటగిరీలు మార్చి వినియోగించిన విద్యుత్ సౌర్యాలకు పాల్పడిన విద్యుత్ చట్టం సెక్షన్ 135 ప్రకారం తగు చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.కందుకూరు డివిజన్లోని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టీ ఎం రాఘవేంద్రరావు,ఆర్ విజయబాబు, పి యుగంధర్ కందుకూరు డివిజన్లోని అందరూ ఏ ఈలు సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టల్ సిబ్బందికి ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి -నెల్లూరు : ఈ ఆర్థిక సంవత్సరం నెల్లూరు పోస్టల్ డివిజన్ పరిధిలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన సిబ్బందికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. గురువారం నగరంలోని తిక్కన ప్రాంగణంలో జరిగిన ఓ కార్యక్రమానికి విజయవాడ రీజియన్ పోస్టుమాస్టర్ జనరల్ డి ఎస్ వి ఆర్ మూర్తి విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ తపాలా సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అనంతరం నెల్లూరు డివిజన్ సూపరింటెండెంట్ కే శ్రీనివాస్ పి ఎం జి ఇచ్చిన సూచనలను పాటించి 2025 -26 ఆర్థిక సంవత్సరంలో మంచి ఫలితాలను సిబ్బంది సహకారంతో సాధిస్తామని తెలిపారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో ప్రతిభను కనబరిన సిబ్బందికి ప్రోత్సాహకాలు అందజేశారు.

వాహనాలు తనిఖీ

ప్రజాశక్తి -గుడ్లూరు : వాహనచోదకులు విధిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఎస్ఐ వెంకట్రావు పేర్కొన్నారు. గుడ్లూరు లోని ఉన్నత పాఠశాల దగ్గర గుడ్లూరు కందుకూరు రహదారిపై అనేక వాహనాలను ఎస్ఐ వెంకట్రావు గురువారం తనిఖీ చేశారు. చలానాలు కట్టకుండా హెల్మెట్లు పెట్టుకోకపోవడం, నిబంధనలు పాటించకుండా నడుపుతున్న వాహనదారులపై కేసులు నమోదు చేశారు 12 పెండింగ్ రశీదులకు చలానాలు కట్టించాడు. ఎస్ఐ వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పత్రికాస్వేచ్ఛను హరించడం దారుణం

- ధనుంజయ రెడ్డి ఇంటిపై పోలీసులు దౌర్జన్యంపై నిరసన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : పత్రికా స్వేచ్ఛను హరించడం దారుణమని పలు జర్నలిస్టు సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. సాక్షి ఎడిటర్ ధనుంజయ రెడ్డి ఇంటిపై గురువారం పోలీసులు ముందస్తు సమాచారం చెప్పకుండా సోదాల పేరుతో దాడులు చేయడం దారుణమన్నారు. ఆత్మకూరులో ఏపీయూడబ్ల్యూజేతో పాటు పలు జర్నలిస్ట్ సంఘాల ఆధ్వర్యంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకర్లు నల్లబ్యాడ్జి ధరించి పత్రికా స్వేచ్ఛను కాపాడాలని ఆర్డీఓ కార్యాలయం వద్ద నినాదాలు చేశారు. అనంతరం ఆర్డీఓ బి.పావనికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిహెచ్ మస్తాన్ రెడ్డి, షేక్ చాంద్ బాషా, టీవీఎస్ మూర్తి, వి. శ్రీనివాసులు, షేక్ కరీం, హరిబాబు, రవికుమార్, రమణారెడ్డి, శ్రీకాంత్, ప్రభాకర్, గోపాల్ రెడ్డి, మున్నా, తదితరులు పాల్గొన్నారు.

కెనరా బ్యాంక్ ఖాతాదారుల కష్టాలు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండలంలోని కావలి ఎడవల్లి కెనరా బ్యాంక్ పరిధిలో రైతులు మరియు ప్రజలు వినియోగదారుల కష్టాలు మామూలుగా లేవని పత్రిక ముఖంగా వాపోయారు. ఈ సందర్భంగా వారు పలు విషయాలను తెలియజేశారు. కావలి ఎడవల్లి బ్యాంకు పరిధిలో సుమారు 14 గ్రామాల ప్రజలు ఖాతాదారులుగా ఉన్నారని, వీరందరూ సుమారు 10 కిలోమీటర్ల నుండి 14 కిలోమీటర్లు ఉన్న ఎడవల్లి బ్యాంకులో ప్రతిరోజు బ్యాంకుకు వచ్చి లావాదేవీలు జరుపుకుంటున్నారు. బ్యాంకులో సిబ్బంది, లేనందువల్ల వారికి సేవలు అందించడంలో విపరీతమైన జాప్యం జరుగుతుంది. గురువారం రోజున నాలుగు గంటల సమయంలో సుమారుగా 50 మంది ఖాతాదారులు వారికి సంబంధించిన పనులు జరగక విసుగెత్తి వెనుదిరిగి వెళ్లిన దుస్థితి ఏర్పడింది. ఉదయం 10 గంటల సమయంలో వచ్చిన వారు మధ్యాహ్నం భోజనం కూడా తెచ్చుకోకుండా ఇబ్బందుల గురికాక తప్పడం లేదు. కాబట్టి రైతులకు ఖాతాదారులకు ఎలాంటి అవాంతరాలు లేకుండా ఇకనైనా ఉన్నతాధికారులు ఈ విషయాన్ని గమనించి తగినంత సిబ్బందిని త్వరితగతిన ఏర్పాటు చేయాల్సిందిగా ఆ బ్యాంకు పరిధిలోని ఖాతాదారులు వేడుకుంటున్నారు. ఇదే పరిస్థితి ఎఎస్‌పేటలోని కెనరా బ్యాంకులో సిబ్బంది కొరత నిమిత్తంగా సమస్య ఎక్కువ ఉండడం కౌంటర్లు తక్కువగా ఉండడం, కొత్తకొత్త రూల్స్ కారణంగా పొదుపు మహిళలు సైతం డబ్బులు కట్టాలంటే, ఒకటికి రెండుసార్లు బ్యాంకులకు రావాల్సిన దుస్థితి ఏర్పడిందని తెలిపారు.

తలసేమియా బాధితులకు అండ

ప్రజాశక్తి-కావలి : తలసేమియా బాధితులకు ఆశాకిరణం రెడ్‌క్రాస్ తలసేమియా కేంద్రం అని కావలి రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షులు డాక్టర్ బెజవాడ రవికుమార్ పేర్కొన్నారు. గురువారం రెడ్‌క్రాస్ తలసేమియా డే కేర్ సెంటర్‌లో ప్రపంచ తలసేమియా దినాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తలసేమియా బాధిత చిన్నారులకు ఆటలు, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. కావలి రెడ్‌క్రాస్ పాలకమండలి సభ్యులు, న్యాయవాది గొట్టిపాటి మనోరమ చిన్నారులను షాపింగ్ మాల్ కు తీసుకువెళ్లి, వారు కోరిన రెడీమేడ్ దుస్తులను కొనిచ్చారు. అనంతరం రెడ్‌క్రాస్ తలసేమియా ఇన్చార్జి వైద్యులు డాక్టర్ శ్రీరామ మనోహర్ బాబు, డాక్టర్ పామూరు శ్రీధర్, డాక్టర్ రమ్య బాధిత చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చిన్నారులకు, తల్లిదండ్రులకు బహుమతులు, దుస్తులు కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు, దాతలు, టీం సేవియర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

మైనారిటీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఆర్థికంగా వెనకబడిన వారికి జీవన్ జీవనోపాధి కల్పించే నిమిత్తం 33 మందికి సబ్సిడీతో కూడిన బ్యాంకు రుణాలను ప్రభుత్వం ఇస్తుందని, 25వ తేదీ లోపల ముస్లిం, సిక్, బుద్దిస్ట్, జైన, పార్శీ కమ్యూనిటీ వారు ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఓ ప్రసాద్ కోరారు. సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసేవారు వారి దరఖాస్తును ఎపిఒబిఎంఎంఎస్ లో 25వ తేదీ లోపల ఆన్లైన్ చేయవలెనని, ఆన్లైన్ సెంటర్లలో గానీ, సమీప సచివాలయాలలో గాని దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఎంపిడిఓ ప్రసాద్ తెలిపారు.

మధుసూదన్ రావుకు నివాళులు

ప్రజాశక్తి-కావలి : కాశ్మీర్‌లోని పహల్గాం ప్రాంతంలో ఉగ్ర మూకల దాడిలో ప్రాణాలు కోల్పోయిన జనసైనికుడు సోమిశెట్టి మధుసూదన్ రావు "పెద్దకర్మ" సందర్భంగా గురువారం జిల్లా నాయకులు మధుసూదన్ రావు తల్లిదండ్రులను, భార్య పిల్లలను ఓదార్చి ఎవిఎస్ కళ్యాణ మండపంలో ఆయనకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు నూనె మల్లికార్జునరావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుందరరామిరెడ్డి, జిల్లా సోషల్ వర్కర్ కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి సమ్మను వెంకట సుబ్బయ్య, చిరంజీవి యువత అధ్యక్షుడు రవి, మురళీ రెడ్డి, మాల్యాద్రి, పాల్గొన్న వారు పవన్ కుమార్, రవి, రాజేష్, శ్రీనాథ్, తోట చరణ్, పోకల చంటి, కత్తుల శివశంకర్, గుంటూరు రమణయ్య, హరి, జానీ, వీర మహిళలు కందుల కవిత, జ్యోతి, నాగ్, పిన్ని షేక్ షమీ, సోమిశెట్టి భాస్కర్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కావలి : పహల్గాంలో ముష్కరుల దాడిలో మరణించిన సోమిశెట్టి మధుసూదన్ రావు "పెద్దకర్మ" కార్యక్రమానికి హాజరై చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాప సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో కావ్య టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (కావ్య), బిబిజ అభ్యుదయ సేవా సంస్థ(బీస్), కాపు సంక్షేమసేన, జనసేన పార్టీ, ఉద్యోగ ఉపాధ్యాయ, అసోసియేషన్ నాయకులు పాల్గొని నివాళులర్పించారు.

ఆదరణ కేంద్రంలో భోజనాలు పంపిణీ

ప్రజాశక్తి-బిట్రగుంట : స్థానిక భవాని ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదరణ కేంద్రంలోని అనాధలకు గురువారం బివిఆర్ యువసేన అధ్యక్షుడు సమీవుల్లా భోజనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి ఆశ్రమాలకు ఫంక్షన్ కార్యక్రమాలలో ఆహార పదార్థాలు మిగిలిన ఎడల వృథా చేయవద్దని, తమకు సమాచారాన్ని ఫోన్ నెంబర్ 9885627377 నెంబర్ కు తెలపాలన్నారు. ఉజ్వీరు శ్రీధర్‌రెడ్డి, బిట్ర రమేష్, షకీల్, యువసేన పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ పనులు పూర్తిచేయాలి

ప్రజాశక్తి-కోవూరు : కోవూరులోని శాంతినగర్లో ఉన్న పడుగుపాడు సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఇనమడుగు గ్రామంలో నిర్మిస్తున్న పెట్రోల్ బంక్ నిర్మాణ పనులను గురువారం జిల్లా సహకార బ్యాంక్ సీఈఓ శ్రీనివాసరావు నిశిత పరిశీలన చేపట్టారు. నిర్మాణంలో ఉన్న పలు విభాగాలకు సంబంధించిన పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. సొసైటీ సీఈవో గోవర్ధన్‌రెడ్డి తదితరులున్నారు.

ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కోవూరు : మానవ శరీరంలో అత్యంత ప్రధానమైన కళ్లను నిర్లక్ష్యం చేస్తే జీవితం అంధకారం అవుతుందని సీనియర్ కంటి వైద్యులు డాక్టర్ ఆకాష్ తెలిపారు. కోవూరులోని జెబీఆర్ ట్రస్టు ఉన్నత పాఠశాల ప్రాంగణంలో గురువారం చాగణం లలితమ్మ - భాస్కరరావు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో తిరుపతి శ్రీ వెంకటేశ్వర అరవింద నేత్రాలయ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులు సీతారామామయ్య మాట్లాడారు. శిబిరంలో 190 మందికి పరీక్షలు నిర్వహించి అందులో 60 మందికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 40 మందికి కంటి పరీక్షలు నిర్వహించి వారికి ఉచితంగా కంటి అద్దాలు అందజేశారు. పరీక్షలకు వచ్చిన వారిలో 50 మందికి కంటి ఆపరేషన్లను ఉచితంగా చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. శిబిరంలో పాల్గొన్న రోగులకు ట్రస్టు ఆధ్వర్యంలో భోజనం అందజేశారు. ట్రస్టు ఎం.గణ్ణ కృష్ణ, అరవింద నేత్రాలయ సిబ్బంది దిలీప్, తదితరులు ఉన్నారు.

రూ.40వేలు ఆర్థికసాయం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : నిత్యావసర సంబరాల ఛారిటబుల్ ట్రస్టు అధినేత కంచి పరమేశ్వరరెడ్డి తన దాతృత్వాన్ని మరోమారు చాటుకున్నారు. ఇటీవల కుటుంబసభ్యులను కోల్పోయిన నాలుగు కుటుంబాలు వారికి తమ ట్రస్టు తరఫున గురువారం రూ.40 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మున్సిపల్ పరిధిలోని 2వ వార్డుకు చెందిన కప్పల పెంచలయ్య, షేక్ అమీర్, 19వ వార్డుకు చెందిన కప్పల కాంతమ్మ, షేక్ సంధాని జీవితం మృతి చెందడంతో వారి కుటుంబాలు పరామర్శించి కంచి పరమేశ్వరరెడ్డి ఒక్కో కుటుంబానికి రూ.10వేలు చొప్పున మొత్తం రూ.40వేలు అందచేశారు. ట్రస్టు సభ్యులు రామచంద్రరెడ్డి, ప్రసాద్ రెడ్డి ఉన్నారు.

బహుమతులు పంపిణీ

ప్రజాశక్తి-కోవూరు : శాంతినగర్‌లో ఉన్న పశువైద్యశాలలో గురువారం నిర్వహించిన లేగదూడల ప్రదర్శనలో పాల్గొన్న దూడల్లో వాటి జాతి లక్షణం, పెరుగుదల, పోషణను పశు సంవర్ధక శాఖ అధికారులు పరిశీలించి 4 దూడలను ఎంపిక చేశారు. మొదటి బహుమతిగా ఆత్మిపల్లి గోవిందరెడ్డి దూడకు, రెండవ బహుమతిగా పోట్లూరెడ్డి మల్లికార్జునరెడ్డి దూడకు, మూడవ బహుమతిగా పండేటి శ్రీనివాసులురెడ్డి దూడకు, నాల్గవ బహుమతిగా ఇంతా శ్రీకాంత్‌రెడ్డి దూడకు అధికారులు బహుమతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ డీడీపీఓ కార్యనిర్వాహణ అధికారి డాక్టర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమోర్త్యులు ప్రత్యేకంగా అభినందించారు. మండల అధ్యక్షుడు మల్లారెడ్డి, పశు వైద్యులు డాక్టర్ జల శంకర్, డాక్టర్ ప్రేమ్ సల్మాన్, డాక్టర్ షబానా, పోట్లూరెడ్డి మల్లికార్జునరెడ్డి ఆత్మిపల్లి గోవిందరెడ్డి ఇంతా శ్రీకాంత్ రెడ్డి పాడి రైతులు ఉన్నారు.

ఉపాధి కల్పించడమే ధ్యేయం

ప్రజాశక్తి-వింజమూరు

మిషన్ కుడుతున్న ఎంఎల్ఎ కాకర్ల సురేష్

నియోజకవర్గంలోని నిరుద్యోగులకు, మహిళలకు, ఉద్యోగం, ఉపాధి అవకాశాలు కల్పించడమే తన ధ్యేయమని ఎంఎల్ఎ కాకర్ల సురేష్ పేర్కొన్నారు. గురువారం వింజమూరు ప్రజా పరిషత్ కార్యాలయం లోని స్త్రీ శక్తి భవన్‌లో ఆంధ్రప్రదేశ్ వెనుక బడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ వారి సహకారంతో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ తరగతులను ఎంఎల్ఎ కాకర్ల సురేష్ ప్రారంభించారు. రిబ్బన్ కటింగ్ చేసిన అనంతరం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కుట్టు మిషన్ తొక్కి మహిళలను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ నియోజకవర్గంలో 8 మండలాలలో టైలరింగ్ శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. ఇప్పటికే మూడు మండలాలలో ప్రారంభించడం జరిగిందన్నారు. మిగతా చోట్ల కూడా త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 1000మంది వరకు శిక్షణ పొందుతారన్నారు. గతంలో శ్రీ కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సుమారు 500 మంది కుట్టు శిక్షణ నేర్చుకున్నారన్నారు. వీరందరికీ కలిపి రెడీమేడ్ దుస్తుల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసే అందరికీ ఉపాధి జరుగుతుందన్నారు. ఆ దిశగా కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. కోఆర్డినేటర్ పద్మ వీటిని పర్యవేక్షిస్తున్నారు. అవకాశాన్ని చక్కగా వినియోగించుకుని ఉచిత కుట్టు మిషన్లు పొందాలని తెలిపారు. ఆదివారంగా పాకిస్థాన్ ఉగ్రవాదు లను పోషించి అనేక పర్యాయాలు భారతదేశంపై ప్రయోగించారన్నారు. ఉగ్రవాదుల చేతిలో భారతమాత బిడ్డలు ప్రాణాలు విడిచారన్నారు. వీరిని దీటుగా ఎదుర్కొనేందుకు భారత ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదుల ఉండే తొమ్మిది ప్రాంతాలను ధ్వంసం చేశారన్నారు. ఇంకా కూడా పూర్తిస్థాయిలో ఉగ్రవాదులను మట్టు పెట్టాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. దానికి నియోజకవర్గం తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. భారత పౌరులు అందరూ ఒక సైన్యం వలె ఏ ఎటువంటి పరిస్థితుల్లో వచ్చిన ఎదుర్కోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడిఓ శ్రీనివాసులు రెడ్డి, మండల కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు యాదవ్, మాజీ మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి, పట్టణ అధ్యక్షులు కోడూరు నాగిరెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షులు జూపల్లి రాజారావు, జడ్పీటిసి సభ్యులు గణపం బాలకృష్ణారెడ్డి, జనసేన మండల కన్వీనర్ బండారు సత్యనారాయణ, సీనియర్ నాయకులు గణపం సుదర్శన్ రెడ్డి, వనిపెంట సుబ్బారెడ్డి, మంచాల శ్రీనివాసులు నాయుడు, తదితరులు ఉన్నారు.

దళితుల జీవనోపాధిని కాపాడండి..

ప్రజాశక్తి-నెల్లూరు

బాధితులతో మాట్లాడుతున్న కెవిపిఎస్ నాయకులు

వుడ్ కాంప్లెక్స్‌కు పోయే దారిలో నివాసముంటూ జీవనోపాధి కోల్పోయిన 25దళిత కుటుంబాలను కాపాడాలని కెవిపిఎస్ జిల్లా కమిటీ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం అనంతరం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నేలపాటి రఘురామయ్య, ఆలూరు తిరుపాలు పరామర్శించి మాట్లాడారు. గత 25 సంవత్సరాల నుంచి దాదాపు 25దళిత మాదిగ కుటుంబాలు వుడ్ కాంప్లెక్స్ నమ్ముకొని కాంప్లెక్స్‌కు పోయే దారిలో పార్కు గోడను ఆనుకొని చిన్నచిన్న గుడారాలు వేసుకొని స్వర్ణ బెంబేలు కత్తి పేటలు తయారుచేసి విక్రయించుకుంటూ తమ పిల్లలను చదివించుకుంటూ జీవిస్తున్నారని తెలిపారు. ఇదే వారికి జీవన ఆధారమని అయితే ఇటీవల వుడ్ కాంప్లెక్స్‌లోని యజమానులు వీరిపై వివక్ష చూపించి వీరు వేసుకునే నివాసం ఉంటున్న గుడిసెలను డ్రెయినేజీ కాలవ నిర్మించే నెపంతో బలవంతంగా తొలగించి వేశారు. దాంతో వీరందరూ తమ నివాసాన్ని ఉపాధిని కోల్పోయారన్నారు. పక్కనే ఉన్న ఎపిఐఐసి పార్కులో తాత్కాలికంగా ఉంటున్నా.. అక్కడకు పోయి కూడా వారిపై తమ ప్రతాపం చూపించి మహిళలు స్నానం చేసేందుకు వేసుకున్న పట్టలను కూడా తొలగించి నిలువ నీడ లేకుండా చేశారన్నారు. దాంతో వీరందరూ నిరాశ్రయులై బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారని తెలిపారు. కాబట్టి సర్వస్వం కోల్పోయి ఉన్నవారి జీవనోపాధిని కాపాడి దౌర్జన్యానికి పాల్పడిన వుడ్ కాంప్లెక్స్ యజమానులపై అట్రాసిటీస్ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు దేవతాటి సంపత్, పులిమి నరసింహారెడ్డి, స్థానికులు మన్నెం వెంకటేశ్వర్లు, మన్నెం తిరుపతయ్య, బుద్ధుల శివకృష్ణ, బుద్ధుల సురేష్, బుద్ధుల శివ, బి రూన్సీ రాణి, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు వేలం ప్రక్రియ పరిశీలన

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని డిసిపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో గురువారం బోర్డు చైర్మన్ యశ్వంత్ కుమార్ సందర్శించి పొగాకు వేలం ప్రక్రియను పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు పంట సాగు వ్యయం బాగా పెరిగిందని, దానిని దృష్టిలో పెట్టుకొని ప్రతి గ్రేడ్ కు మంచి గిట్టుబాటు ధర కల్పించాలని వ్యాపార ప్రతినిధులను కోరారు. అలాగే రైతులు ప్రస్తుత మార్కెట్లో అమ్ముడు పోయే పొగాకును మాత్రమే తీసుకురావాలని, పొగాకులో ఎటువంటి అన్య పదార్థాలు లేకుండా గ్రేడింగ్ చేయాలన్నారు. నెమ్మదిగా వేలంకు తీసుకుని వచ్చి అమ్ముకోవాలని కోరారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు వేలం నిర్వహణ అధికారి జి.రాజశేఖర్, రైతు సంఘం నాయకులు గాలి నరసప్ప నాయుడు, మూలి వెంగయ్య, పొగాకు రైతులు, పొగాకు బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి నేతలు మాట్లాడడం సిగ్గుచేటు

ప్రజాశక్తి-బిట్రగుంట : తమపై అక్రమ కేసులు బనాయిస్తూ కక్ష సాధింపులకు పాల్పడుతుందని వైసిపి నాయకులు గగ్గోలు పెట్టడం సిగ్గుచేటని, నెల్లూరు పార్లమెంటు ఆర్గనైజింగ్ సెక్రెటరీ రావి విజయ్ కుమార్ దుయ్యబట్టారు. గురువారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రావి విజయ్‌కుమార్ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో టిడిపి నాయకులపై కార్యకర్తలపై అన్యాయంగా ఎన్ని కేసులు పెట్టి ఎలా వేధించారో అని మండల ప్రజలందరికీ తెలుసన్నారు. తనపైనే అట్రాసిటీ కేసు 304 కేసు పెట్టి 26 రోజులు జైల్లో పెట్టిన సంగతి మర్చిపోయారా అని తెలియజేశారు. మండల యూత్ నాయకులు ఐడి హర్ష మాట్లాడుతూ గతంలో ఎన్నడు మండల పార్టీ నాయకుల్లో స్నేహపూర్వక వాతావరణం ఉండేదని వైసిపి మండల అధ్యక్షుడిగా మద్దిబోయిన రఘు ఎన్నికైన తర్వాత వ్యక్తిగత దూషణలు, వేధింపులు పెరిగిపోయాయన్నారు. మండల అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావు మా నాయకుడు ఎంఎల్ఎ కావ్య కృష్ణారెడ్డి అభివృద్ధి సంక్షేమం పైనే దృష్టి పెట్టడం జరిగిందని, వ్యక్తిగత కక్షలు అక్రమ కేసులకు తావు లేదని తెలిపారు. వైసిపి నాయకులు ప్రశాంతంగా ఉన్న బోగోలు మండలంలో అలజడి సృష్టించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, ఆరోపించారు. గత ప్రభుత్వంలో వ్యక్తిగత కక్ష సాధించే తప్ప అభివృద్ధికి చోటు లేదన్నారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు ఎల్.సుధీర్ బాబు, రామ్మోహన్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, ఎల్.కిషోర్ బాబు, ధన్యాసి శ్రీధర్. బోగిరి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలకు సహకరించాలి

ప్రజాశక్తి-కోవూరు : గ్రామాలు స్వచ్ఛ గ్రామాలుగా తయారయ్యేందుకు ప్రజలు పూర్తిస్థాయిలో సహకారం అందించాలని గ్రామ సర్పంచ్ వై.విజయ తెలిపారు. కోవూరు పంచాయతీ పరిధిలోని పెళ్లకూరు కాలనీ ప్రాంతంలో కోవూరు ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆదేశాల మేరకు పంచాయతీ ఆధ్వర్యంలో ఇంటింటికీ చెత్త బుట్టల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఇంతా మల్లారెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, సీనియర్ వార్డు సభ్యులు గాదిరాజు అశోక్ కుమార్, బెల్లంకొండ విజయకుమార్, సీనియర్ పార్టీ నేతలు రవి కుమార్, సాయిరెడ్డి, శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.

అళహరి నివాళులు

ప్రజాశక్తి-కావలి : ఉగ్రవాద దాడిలో మృతిచెందిన సోమిశెట్టి మధుసూధన్ రావు పెద్ద కర్మకు కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ అళహరి సుధాకర్ హాజరై వారి తల్లిదండ్రులను వారి శ్రీమతిని కలిసి తదుపరి మధుసూదన్ చిత్రపటానికి పూలతో శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమానికి ఇంచార్జితో కలిసి బాలు, శ్రీను, ఆలా శ్రీనాథ్, మండ శ్రీను, అగస్టీన్, సాదు శ్రీధర్, మురళి కష్ణ, కొప్పుల లక్ష్మి, కవిత, మాధురి పాల్గొని మధుబాబుకి శ్రద్ధాంజలి ఘటించారు.

రైతులకు పరిహారం పెంచి అందించాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

నడికుడి - శ్రీకాళహస్తి రైల్వే లైను పనుల కోసం పొలాలను అందచేస్తున్న రైతులకు ప్రస్తుతం ప్రభుత్వం సూచించిన పరిహారం కంటే ప్రస్తుత మార్కెట్‌ను దృష్టిలో ఉంచుకుని పరిహారం పెంచి అందించాలంటూ మండలంలోని అప్పారావుపాళెం వాసులు గురువారం ఆర్‌డిఒ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వే లైను నిర్మాణం కోసం అప్పారావుపాళెం పరిధిలో సుమారు 48ఎకరాల భూమిని అధికారులు భూసేకరణ చేసేందుకు నిర్ణయించారని, అందుకు గానూ గతంలో సూచించిన పరిహారం కొంత పెంచి అందచేసేలా సమావేశం నిర్వహించి అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారన్నారు. అధికారులు ప్రతిపాదించిన రూ.7.6లక్షల నుంచి రూ.9లక్షల వరకు పరిహారం చాలా తక్కువగా ఉందని, ప్రస్తుతం మార్కెట్ ధరను అనుసరించి రూ.19లక్షల వరకు ఉందని ఆ మేరకు అందించేలా చూడాలని కోరారు. అంతేకాక పొలాల మధ్య నుంచి రైల్వే లైను వెళ్తున్న సమయంలో రైతులకు ఇరువైపులా ఉండే మిగిలిన పొలాన్ని కూడా భూసేకరణ కింద తీసుకోవాలని, దీని వల్ల రైతులు నష్టపోకుండా ఉంటారని అన్నారు. రైల్వేలైను నిర్మాణం 8.5 మీటర్ ఎత్తులో వెళ్తున్నందున పెన్నా నదికి వరదలు వచ్చిన సమయంలో అప్పారావు పాళెం, కొత్తపాళెం, బట్టేపాడు, నల్లపరెడ్డిపల్లి, మురగళ్ల గ్రామాల్లో సుమారు 3వేల ఎకరాలు ముంపుకు గురయ్యే ప్రమాదం ఉందని, నీరు ఎగువకు వస్తే ఆత్మకూరు పట్టణానికి కూడా ఇబ్బంది కలిగే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం ఉన్న బ్రిడ్జి నిర్మాణం గ్రామం వరకు పొడిగించి గ్రామస్తుల కు ఎటువంటి కష్టం కలగకుండా చూడా లని విన్నవించినట్లు తెలిపారు. వినతిపత్రాన్ని పరిశీలించిన ఆర్‌డిఒ ఈ విషయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారన్నారు.

యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

ఎంతోచరిత్ర ఉన్న సహజ సంపద కలిగిన కొండను దోచేస్తున్నారని జిల్లా కౌలురైతు సంఘం నాయకులు ముత్యాల గురునాథం ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక మండలంలోని పెనుబల్లి గ్రామపంచాయతీ చరిత్ర కలిగిన తిప్ప గ్రావెల్‌ను అనుమతులు లేకుండా గురువారం ఆ గ్రామ టిడిపి నాయకులు యథేచ్ఛగా దోచేస్తున్నారని ఆయన ఆరోపించారు. గత ప్రభుత్వంలో ఆ తిప్ప గ్రావెల్ ను కొంతమేరకు అప్పటి నాయకులు కాజస్తే గత రెండు రోజులుగా స్థానిక టిడిపి నాయకులు మిగిలిన కాస్త తిప్పను కూడా జెసిబిల సాయంతో త్రవ్వతూ సొమ్ము చేసుకుంటున్నారని ఆయన మండిపడ్డారు. అరుంధతీయవాడకు సంబంధించి శ్మశానానికి వెళ్లే దారిని కూడా వదలకుండా తవ్వుతున్నారని ఆ ప్రాంతవాసులు తమకు తెలియజేశారని ఆయన వెల్లడించారు. రెండు రోజుల క్రితం గ్రావెల్‌ను తవ్వకాలు చేస్తున్న సమయంలో స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు మైనింగ్ అధికారులు త్రవ్వకాలను అడ్డుకొని వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించగా యథావిధిగా తిరిగి మొదలుపెట్టారన్నారు. స్థానిక మండల అధికారులు అక్రమంగా గ్రావెల్ ను తరలించే వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం తరపున ఆయన డిమాండ్ చేశారు.

11న ఓపెన్ చెస్ పోటీలు

ప్రజాశక్తి-కావలి

ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ అండ్ ఆర్.ఎల్. చెస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో కావలి పట్టణంలో 11వ తేదీన ఆదివారం ప్రారంభంకానున్న ఆలిండియా ఓపెన్ చెస్ పోటీలు జయప్రదం చేయాలని కావలి ఎంఎల్ఎ దగుమాటి వెంకట కృష్ణారెడ్డి నేడు పిలుపునిచ్చారు. స్థానిక ముసునూరులోని ఎంఎల్ఎ కార్యాలయంలో చెస్ క్రీడాపోటీల గోడపత్రిక ఆవిష్కరణలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 100మంది పైగా అంతర్జాతీయ చదరంగం క్రీడాకారులతో పోటీల నిర్వహణకు కావలి వేదిక అవ్వడం హర్షనీయ మన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు రూ.52వేల నగదు బహుమతులందిస్తు న్నట్లు ఆర్.ఎల్. చెస్ అకాడమీ డైరక్టర్స్ రామ్-లక్ష్మణ్ తెలిపారు. ఈ పోటీలను కావలిలోని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోని, వాళ్లలోని క్రీడా నైపుణ్యం వెలికి తీసి, ఆటారీత్యా, నగదు రీత్యా లబ్ధి పొందాలనే ఉద్దేశంతోనే ఈ ఓపెన్ పోటీలు నిర్వహిస్తున్నామని రాష్ట్ర చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.సుమన్ పేర్కొన్నారు. ఈ పోటీలను నిర్వాహకులు ఆర్.ఎల్. చెస్ అకాడమీ డైరక్టర్స్ రామ్-లక్ష్మణ్, శ్రీనివాసులు తదితరులు ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-కోవూరు : గతంలో కోవూరు గ్రామ పంచాయతీలో పనిచేసిన సమయంలో పంచాయతీ కార్యదర్శి శివకుమార్ పంచాయతీకి చెందిన కొంతనగదును మిస్ ఆపరేషన్ చేశారని అందుకు సంబంధించి అధికారుల విచారణలో నిర్ధారణ కావడంతో పంచాయతీ కమిషనర్ నుంచి మంగళ వారం ఆదేశాలు అందాయి. అందులో రూ.1.16 కోట్లు అవినీతి జరిగిందని పలు దఫాలుగా విచారించిన అనంతరం సస్పెన్షన్ చేసినట్లు నివేదికలో పేర్కొన్నారు. అందుకు సంబంధించి ప్రజాశక్తి దినపత్రికలో ఈ విషయాన్నీ మర్చి 22 తేదిన ప్రధాన సంచికలో ప్రచురితమైనది. అపట్లో ఈ వార్త కొంతమందిని కలవరపాటుకి గురిచేసింది అంతలోతుగా వెళ్లి పూర్తిగా అధరాలు సేకరించడం జరిగింది. కేవలం కొంత రికార్డు పరిశీలిస్తేనే కోటి పదహారు లక్షలు అవినీతి జరిగిందని, దానిని మరింత లోతుగా విచారణ జరిపితే ఎన్ని కోట్లు కుంబకోణం జరిగిందో తెలుస్తుందని, దానిపైన అధికారులు విచారణ చేపడతారో వేచి చూడాలి.

ఆక్రమిత పంట కాలువలు పరిశీలన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని స్పార్క్ సిటీ వెనుక వైపున ఆక్రమణకు గురైన పంట కాలువను ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు గురువారం పరిశీలించారు. గతంలో ఈ ప్రాంతంలో 20 ఎకరాల్లో నాలుగు లేఅవుట్లు ఏర్పాటు చేశారని, వీటి మున్సిపల్, నుడా, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల నుంచి అనుమతులు లేవంటూ స్థానికులు, సీమాంధ్ర ఎమ్మార్పీయస్ నాయకులు జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయడంతో జాయింట్ కలెక్టర్ ఆదేశాలతో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఆ ప్రాంతాన్ని పరిశీలించి హద్దులు ఏర్పాటు చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పంట కాలువల ఆక్రమణపై ఫిర్యాదు చేసిన దీపోగు బాబు, రైతాంగ సమస్య కావడంతో జిల్లా రైతు సంఘం నేత లక్కు ప్రసాద్ కూడా ఈ పరిశీలనలో ఉన్నారు.

హాస్పిటల్ ప్రారంభోత్సవం

ప్రజాశక్తి-కావలి

పట్టణం లోని క్రిస్టియన్ పేట మొదటి లైన్‌లో డాక్టర్ కె.భాను ప్రకాష్, డాక్టర్ కె.భావన, డాక్టర్ కె.శ్రీనివాసులు ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన "భాను ఆర్థో అండ్ చెస్ట్ హాస్పిటల్" ను కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి, ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గుంటుపల్లి రాజ్‌కుమార్ చౌదరి, నున్నా మురళి, డాక్టర్ బెజవాడ రవికుమార్, డాక్టర్ సుబ్బారావు, స్థానిక వార్డు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రీసర్వే పరిశీలన

ప్రజాశక్తి-దగదర్తి : మండల పరిధిలోని శ్రీరాంపురంలో జరుగుతున్న ఈ సర్వే పనులను కావలి ఆర్‌డిఒ వంశీకృష్ణ పరిశీలించారు. అనంతరం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దారు పి.కృష్ణ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, మండల సర్వేరు ఎస్.కె. రబియా, విఆర్‌ఒలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు అండ

ప్రజాశక్తి-కొడవలూరు : విద్యార్థినీ విద్యార్థులు మంచి చదువులు చదివి భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చుదిద్దుకోవాలని రామాపురం గ్రామానికి చెందిన పొన్నూరు ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. అనంతరం ప్రవీణ్ కుమార్ జన్మదిన వేడుక సందర్భంగా విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశ్వ జనని వ్యవస్థాపకులు, వినయ్ పాల్గొన్నారు.

మధుసూదన్‌కు ఎంఎల్ఎ నివాళులు

ప్రజాశక్తి-కావలి

పహాల్గాం ఉగ్రదాడిలో మరణించిన కావలి పట్టణానికి చెందిన సోమిశెట్టి మధుసూదన్ రావుకు ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి నివాళులర్పించారు. మధుసూదన్ ఉత్తరక్రియల కార్యక్రమం పట్టణంలోని ఎవిఎస్ కళ్యాణ మండపంలో బుధవారం జరిగింది. కార్యక్రమంలో కావలి ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి పాల్గొని మధుసూదన్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మధుసూదన్ నివాసానికి చేరుకొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో గుంటుపల్లి రాజ్ కుమార్ చౌదరి, నున్నా మురళి, జనసేన నాయకులు సమ్మను వెంకట సుబ్బయ్య, స్థానిక వార్డు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-ఉలవపాడు : స్థానికశాఖా గ్రంథాలయం ఉలవపాడులో గురువారం వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా విద్యార్థులతో ముందుగా నీతి కథలు, జాతీయ నాయకుల జీవిత చరిత్రలు, విజ్ఞానదాయక మైన పుస్తకాలు చదివించటం జరిగిందని గ్రంథపాలకుడు డి.కోటేశ్వరరావు తెలిపారు. అనంతరం పిల్లల్లో వారి సామర్థ్యాన్ని పరీక్షించే కోణంలో వారికి క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీగా వై.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా మద్యం లూజ్ విక్రయాలు

ప్రజాశక్తి - ఉదయగిరి

విచ్చలవిడిగా మద్యం లూజ్ విక్రయాలతో కిక్ లేదంటున్న మద్యం ప్రియులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్న సంబంధిత అధికారులు చర్యలు లేకపోవడమే యాజమానుల అండతో వారు ఇష్టానుసారం హవా సాగుతుందని పలువురు పెదవి విరుస్తున్నారు. చర్యలు లేవు మా రూటే సపరేటు అంటూ.. కారు బైకులతో బెల్ట్ షాపులకు మద్యం తరలిస్తున్నారు. బారులను తలపిస్తున్న పర్మినెట్ మద్యం దుకాణాలు కొంతకాలం సాధారణ భీరు రేట్ల కన్నా అధికంగా పది రూపాయలు వసూలు చేసిన గణతకుడా ఉంది. రాత్రి పగలు తేడా లేక సమయపాలన లేకుండా విచ్చలవిడిగా విక్రయాలు మూడు పూవులు ఆరు కాయలుగా మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఒకపక్క సిబ్బంది మద్యం సేవించి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్న ఆరోపణలు విమర్శలు రోజురోజుకు అధికమవుతున్నాయి. మద్యం విక్రయాలపై గ్రామాలలో వివాదాలకు దారితీస్తున్న తీరును గ్రామ మహిళలు పలువురు ప్రజాసంఘాల నేతలు గతంలో గాంధీ జయంతి రోజున విచ్చలవిడిగా మద్యం షాపుల వద్ద విక్రయాలు జరిగిన వాటి వారిపై చర్యలు తీసుకోకపోవడంతో సంబంధిత జిల్లా అధికారులు చర్యలు లేకపోవడంతో రోజురోజుకు ఇలాంటి వారి ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతుందని విమర్శలు గుప్పుమనిపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మద్యం దుకాణాలపై నిఘా ఉంచి ఇలాంటి అమ్మకాలు జరపకుండా ప్రత్యేక చర్యలు తీసుకోని అట్టివారిపై చర్యలు తీసుకుంటారా.. లేదా.. అనేది వేచిచూడాలి.

పశుగ్రాసానికి గడ్డుకాలం..

- ట్రక్కు రేటు రూ.14వేల నుంచి రూ.18వేలు

- రైతులకు తప్పని పాట్లు

ప్రజాశక్తి వరికుంటపాడు

పశుగ్రాసం కొరతతో మండలంలోని రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పశు గ్రాసం కోసం ఇతర గ్రామాలైన ప్రకాశం జిల్లా దర్శి, వర్గంపల్లి, కోడిగుడ్లపాడు గ్రామాల నుంచి వరిగడ్డిని కొనుగోలు చేస్తున్నారు. పశుగ్రాసం కొరతతో పాడి రైతులు పరేషాన్ అవుతున్నారు. సకాలంలో వర్షాలు కురవక పోవడంతో పశుగ్రాసం కొరత కారణంగా ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయి. పెరిగిన ధరలతో పశుగ్రాసం కొనుగోలు చేయలేక పశువులు పెంచటానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలపై ఆధారపడి బోర్లు, బావులు కింద పంట సాగు చేస్తారు. వేట వివిధ రకాలైన గ్రాసం టైర్లను సాగు చేసేవారు. దాంతో పశుగ్రాసం కొరత ఏర్పడి పశుపోషకులు కటకటలాడుతున్నారు. ప్రస్తుతం వేసవికాలం కావడంతో పచ్చిక దొరక్క పసుపూసకులు అల్లాడిపోతున్నారు. ఈ క్రమంలో ఎండు గడ్డి సైతం ధరలు విపరీతంగా పెరిగింది. దాంతో మూగజీవుల పోషణ భారంగా మారడంతో అధికశాతం మంది పశువుల కోసం గ్రాసం కొనలేక అమ్ముకుంటున్నారు. ఒక ట్రక్కు రూ.18వేలు వరకు వెచ్చించి కొనుగోలు చేయాల్సి వస్తుంది. ఏడాది గ్రాసం ధర ఆకాశం అంటుతుంది. గతేడాది రూ.10వేల నుంచి రూ.12 వేలు పలుకగా ఈ ఏడాది ట్రక్కు వరిగడ్డి రేటు రూ.14 వేల నుంచి రూ.18 వేలు పలుకుతుంది. దానికి తోడు ట్రక్కులో వేసేందుకు కూలీలు రూ.3వేలు అదనంగా వెచ్చించి వరిగడ్డి ని ట్రాక్టర్ లో కొనుక్కొని వెళ్తున్నారు. ప్రస్తుతం పాల ధరలు ఎక్కువగా ఉండటం, గ్రాసం దొరకపోవడం దొరికిన అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి రావడంతో పశుపోషకులు తమ పశువులను వదిలించుకునే పరిస్థితులు నేటి రోజుల్లో నెలకొన్నాయి. ఇకనైనా ప్రభుత్వం చొరవ చూపి పాడి రైతులకు ఎంతోకొంత ఆర్థిక సహాయం చేయాలని ఆవేదన వ్యక్త పరుస్తున్నారు. దీనిపై సంబంధిత పశుసంవర్ధక శాఖ అధికారులు తగు చర్యలు తీసుకొని గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు ప్రభుత్వం నుంచి పాడి రైతులకు ఆర్థిక సాయం కల్పించాలని పాడి రైతులు కోరుతున్నారు.

ఎజా.20వేలకు వరిగడ్డిని కొనుగోలు చేశాం..
గుబిలి రత్తయ్య, విరువూరు గ్రామం.

తీవ్రమైన వరుస భావం భర్తతో పశు గ్రాసం కొరత ఏర్పడడంతో ప్రకాశం జిల్లా కోడిగుడ్లపాడు నుంచి 20వేలుకు ట్రాక్టర్ వరి గడ్డిని కొనుగోలు చేసి కొనుక్కొచ్చుకున్నాము. ఈ విధంగా వరిగడ్డిని కొనుగోలు చేయాలంటే కష్టతరంగా ఉంది. ప్రభుత్వం పశుగ్రాసం సబ్సిడీ మీద అందిస్తే కొంతవరకు మేలు జరుగుతుంది.

జనరల్ నోటీసు

క్లయింట్ అయిన **షేక్ వాజిద్** తండ్రి లేట్ **షేక్ మహబూబ్ సాహెబ్,** డోర్ నెం.1-239, నక్కా గోపాల్ నగర్, కొత్తూరు, నెల్లూరు నగరం అను వారు ఇచ్చిన వివరముల మేరకు యిందు మూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా:- నా క్లయింట్‌కు ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తి **1. షేక్ సాహెర, 2. షేక్ ఆయేష, 3. షేక్ ఆఫ్రీన్** అనువారల వద్ద నుండి రిజిష్టర్డు శెటిల్‌మెంటు పత్రం **తేది: 02-08-2022 దాక్యుమెంటు నెం.11250/2022** ద్వారా సంక్రమించినదని, సదరు **షేక్ సాహెర, షేక్ ఆయేష, షేక్ ఆఫ్రీన్** గార్లకు క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తి 1వ వారికి భర్త, 2, 3 వారలకు తండ్రిగారైన **షేక్ మహబూబ్ సాహెబ్** గారు క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని **మోరిశెట్టి పానకాల రావు** గారి వద్ద నుండి **రిజిష్టర్డు విక్రయ పత్రం తేది: 21-12-2019 దాక్యుమెంటు నెం.12261/2019** ద్వారా కొనుగోలు చేసుకొని ఆయన హక్కు అనుభవంలో ఉంటూ వున్న ఆస్తిని గురించి వారు ఏలాంటి వ్రాతపూర్వకమైన ఏర్పాట్లు చేయకనే కాలం చేసినారని ఆయన మరణానంతరం పై వారలకు క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తి వారసత్వ రీత్యా సంక్రమించినదని, సదరు **మోరిశెట్టి పానకాల రావు** గారికి క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తి ఆయన భార్య **మోరిశెట్టి చెంచమ్మ** గారు **కాంజీవరం వరదరాజులు కాంతారావు** వగైరాల వద్ద నుండి రిజిష్టర్డు విక్రయ పత్రం **తేది: 22-08-1986 దాక్యుమెంటు నెం.4843/1986** ద్వారా కొనుగోలు చేసుకొని ఆమె హక్కు అనుభవములో ఉంటూ ఉన్న ఆస్తిని గురించి ఆమె ఎలాంటి వ్రాతపూర్వకమైన ఏర్పాట్లు చేయకనే కాలం చేసినారని, సదరు **పానకాల రావు, చెంచమ్మ** గారికి సంతానం లేనందున ఆమె తదనంతరం ఆమె భర్త గారైన పానకాలరావు గారికి వారసత్వ చట్టరీత్యా క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తి సంక్రమించినదని చెప్పుచున్నారు. నా క్లయింట్ **తేది: 21-04-2025** న నెల్లూరు ఆర్.టి.సి. బస్టాండు వద్ద జెరాక్స్ తీసుకొంటుండగా సదరు **ఒరిజినల్ లింకు దాక్యుమెంటు నెం.4843/1986** కనిపించకుండా పోయినది. వెంటనే నా క్లయింట్ చుట్టుప్రక్కల ఎంత వెతికిన ప్రయోజనం లేకుండా పోయినది. సదరు **ఒరిజినల్ లింకు దాక్యుమెంటు నెం.4843/1986** ఎవ్వరికైనను దొరికినయెడల పై తెలిపిన నా క్లయింట్ అడ్రస్సుకు గానీ లేదా క్రింది తెలిపిన చిరునామాకు గానీ తెచ్చి ఇవ్వవలసినదిగా కోరడమైనది.

ఆస్థి షెడ్యూలు

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్ యిలాకా నెల్లూరు సబ్-రిజిస్ట్రారులో చేరిన, నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో చేరిన నెల్లూరు బిట్-1 సర్వే నెం.2081-2బి, 2083-3ఎ & 2083-3బి ర్లులోని కొత్తూరు ఏరియాలోని భూమి అప్రూవ్డ్ కాబడిన లే అవుట్ ప్లాను దాఖలా ప్లాట్లులో నెం.20 రు ప్లాటు విస్తీర్ణం 33 1/2 అంకణములు ఖాళీ స్థలములో ఉత్తర పార్శ్వం 27 1/2 అంకణములు ఖాళీ స్థలమునకు **హద్దులు :- తూర్పు:** నెం.19 రు ప్లాటు, **దక్షిణం:** యీ దినం మేము నీకు చెందజేసిన యీ ప్లాటులోని మిగతా 6 అంకణములు స్థలం, **పడమర :** షేక్.బషీర్ గారి యిల్లు స్థలం, **ఉత్తరం:** లే అవుట్ రోడ్డు. యీ హద్దులలోని 27 1/2 అంకణములు లేక 220 చదరపు గజములు స్థలం. యిందుకు సంబంధించిన మామూలు రాకపోకల యావత్తు యీజ్‌మెంటు హక్కులతోటి.

యస్.వి.విజయలక్ష్మీ, ఎం.కాం., బి.ఎల్.,
అడ్వకేట్, డోర్ నెం.20-1-189,మొదటి అంతస్తు,
సరస్వతి సమాజం ప్రక్కన, మూలాపేట,
నెల్లూరు-524003. సెల్: **98660 22728**